

కమ్యూనిస్టులు ఏకం కావాలి

మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు కమ్యూనిస్టులు ఏకం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని పిలుపునిచ్చారు. 8లో



అండర్‌-19 క్రీడా జట్ల ఎంపిక

జిల్లా జూనియర్‌ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 20°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ వాతావరణం కొంత చల్లబడుతుంది.

రైతులకు అండగా 'సాక్షి'

మార్కెటింగ్‌ శాఖ అధికారితో నేడు ఫోన్‌ ఇన్‌





ఎం.ఏ.అలీం

ఖమ్మంవ్యవసాయం: పంటల కొనుగోళ్ల సీజన్‌ మొదలైన నేపథ్యాన రైతులకు అవగాహన కల్పించేలా 'సాక్షి' ఫోన్‌ ఇన్‌ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రస్తుతం పత్తి, వరి ధాన్యం విక్రయాలు మొదలుకాగా, రైతులకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. ఇందుకోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయగా నిబంధనలను తెలుసుకోవడంతో సమస్యలను వివరించేందుకు రైతులు ఫోన్‌ ఇన్‌ను ఉపయోగించుకోవచ్చు. రైతుల సందేహాలను జిల్లా మార్కెటింగ్‌ శాఖ అధికారి ఎం.ఏ.అలీం నివృత్తి చేస్తారు.

తేదీ : 28-10-2024, సోమవారం

సమయం : ఉదయం 8-30 నుంచి 9-30 గంటల వరకు

ఫోన్‌ చేయాల్సిన నంబర్‌:

73307 33149

న్యూస్‌రీల్‌

జిల్లాలో నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు సత్తుపల్లిలో ఓ ప్రైవేట్‌ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు ఖమ్మం నగరంలోని 19వ డివిజన్‌లో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ముగిసిన వేద విద్వన్మహాసభలు



జయ పత్రం అందిస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

ఖమ్మంగాంధీచౌక్‌: నగరంలోని బైపాస్‌ రోడ్‌ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ వేద విద్వన్మహాసభలు ఆదివారం ముగిశాయి. శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి సేవా సమితి వారు మహాసభలు నిర్వహించగా, రాష్ట్రంలోని 80 వేద పాఠశాలలకు చెందిన 473 మంది విద్యార్థులను పరీక్షలకు అర్హులుగా గుర్తించారు. వీరికి వేదం, తశుక్ల కార్య, కృష్ణ మైత్రాయిని, కృష్ణ తైత్తిరీయ, సామ రాణాయనీయ, అధర్వానిక విభాగాలపై పరీక్షలు నిర్వహించగా 371 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన వారికి తుని ఆశ్రమం శ్రీ దర్శపురి పీఠాధిపతి సద్గురు శ్రీసచ్చిదానంద సరస్వతీ స్వామి జయపత్రాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ చైర్మన్‌ సాయినాథ్‌ శర్మ, కార్యదర్శి బ్రహనందం, ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ ఏసీ ఎం.వీరస్వామి, శ్రీ గాయత్రీ సేవా సమితి ప్రతినిధులు హరి శ్రీనివాస్‌, హరి చంద్రశేఖర్‌, సుందర రామయ్య, పెండ్యాల శ్రీరామ్మూర్తి, తుంతుర్తి సుబ్బారావు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో చిరుతపులి సంచారం సంచలనంగా మారింది. గతంలో ఎన్నడూ లేనట్లుగా ఇటీవల తరచుగా చిరుతపులుల అడుగు జాడలు బయటపడుతున్నాయి. పూర్వ ఖమ్మం జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉంది. తాజాగా ఆయా ప్రాంతాల్లో చిరుతల సంచారం ఉన్నట్లుగా అటవీ అధికారులు కూడా గుర్తిస్తున్నారు. గతంలో జూలూరుపాడు – ఏన్కూరు మండలాల మధ్య అటవీ ప్రాంత సమీపంలో చిరుత పులి అడుగులను గుర్తించగా.. ఇటీవల ఏన్కూరు మండలం రేపల్లెవాడ సమీపంలో ఓ రైతు మిర్చి తోటలో చిరుత పులి పిల్ల అడుగుజాడలను గుర్తించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

చిరుత.. చింత

ఏన్కూరు మండలం రేపల్లెవాడలో చిరుత పాదముద్రలను గుర్తిస్తున్న అటవీ అధికారులు (ఫైల్‌)

ఉమ్మడి జిల్లాలో చిరుతపులి అడుగుజాడలు

- ఏన్కూరు మండలంలో కనిపించిన పులి పిల్ల
- ఇటీవల జూలూరుపాడు మండలంలోనూ సంచారం
- పాదముద్రల ఆధారంగా నిర్ధారించిన అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం

అడవి అనుకూలంగా మారుతోందా?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు ఏన్కూరు, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో అడవులు ఉన్నాయి. దీంతో ఈ అటవీ ప్రాంతంలో జంతువుల సంచారానికి అనువైన వాతావరణం కల్పించినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో పలుమా ర్లు ఈ అటవీ ప్రాంతాలకు పులులు వచ్చినట్లుగా తెలుస్తోంది. గతంలోనూ భద్రాద్రి జిల్లాలో పులుల ను గుర్తించారు. పులులు సంచరించాలంటే విశాలమైన అటవీప్రాంతం ఉండాలి. అయితే తాజాగా ఇతర రాష్ట్రాలతో అనుసంధానంతో అటవీ ప్రాంతం విస్తరించడంతో పులులు ఈ ప్రాంతాలకు వస్తున్నట్లుగా అటవీ అధికారులు గుర్తిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10 లక్షల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 1.21 లక్షల ఎకరాల అటవీ ప్రాంతం ఉంది.

గతంలోనూ చిరుతపులి అడుగుల గుర్తింపు..

గతంలో ఏన్కూరు–జూలూరుపాడు అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరించినట్లుగా అటవీ అధికారులు గుర్తించారు. ఈ సరిహద్దు ప్రాంతంలోని మున్యాతండా–భద్రుతండా గ్రామాల మధ్య మాన్‌సింగ్‌ అనే రైతుకు చెందిన మిర్చి తోటలో చిరుత పులి అడుగులు గుర్తించారు. కోతులు, కొండముచ్చుల నుంచి పంటను కాపాడుకోవడానికి ఆ రైతు రాత్రి సమయంలో కుక్కను కట్టేసి వెళ్లాడు. తెల్లవారుజామున వచ్చే సరికి కుక్క కనిపించలేదు. సమీపంలో వెదకగా.. గుట్టలపైకి కుక్కను లాక్కెళ్లిన జాడలు కనిపిచడంతో రైతు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు వచ్చి మిర్చి తోటలో పరిశీలిచగా జంతువు అడుగులు కనిపించాయి. వీటిని పరిశీలించడంతోపాటు కుక్కను లాక్కెళ్లిన విధానాన్ని చూసిన అధికారులు ఆడ చిరుతపులిగా నిర్ధారించారు.

తాజాగా ఏన్కూరు మండలంలో..

రెండు రోజుల క్రితం మరోసారి చిరుతపులి కలకలం సృష్టించింది. ఏన్కూరు మండలం రేపల్లెవాడ సమీపంలో ఓ మిర్చితోటలో చిరుతపులి పిల్లను గుర్తించారు. తోటకు కాపలా ఉన్న వ్యక్తి చిరుతపులి పిల్లను గమనించి వీడియో తీశాడు. ఈ విషయాన్ని రైతు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు మిర్చితోటకు చేరుకుని అక్కడ ఉన్న పాదముద్రలను సేకరించారు. ఈ పాదముద్రలు చిరుత పులి పిల్లవిగా చెబుతుండటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు గ్రామాల్లో చాటింపు వేయిచారు.

చిరుతపులులు సంచరిస్తున్నాయా?

జిల్లాలో చిరుతపులుల జాడలు కనిపిస్తుండటంతో నిజంగా జిల్లా అటవీ ప్రాంతంలో పులులు సంచరిస్తున్నాయా..? ఇక్కడ సంచరించడానికి అనుకూలమైన వాతావరణం ఉందా అనే చర్చ ప్రజల్లో సాగుతోంది. అయితే జరుగుతున్న సంఘటనలు, అటవీ అధికారులు చెబుతున్నది పరిశీలిస్తే మాత్రం చిరుతపులి సంచారాన్ని కొట్టిపారేయలేమనే వాదనలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు గతంలోనూ పలుచోట్ల పొలాల్లో పాదముద్రలను గుర్తించారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అటవీ ప్రాతంతో పాటు పొలాల్లో వీటి పాదముద్రలను సేకరించారు. ప్రస్తుతం ఏన్కూరు మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపంలో మాత్రం అడుగు జాడలే కాకుండా చిరుతపులి పిల్ల సంచారం కూడా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. దీంతో అటవీ ప్రాంతంలో జంతువులు సంచరిస్తున్నాయని, అవి రాత్రి సమయంలో సమీపంలోని పొలాల్లోకి వస్తున్నాయనే చర్చ సాగుతోంది. ఇటీవలే ఏన్కూరు, జూలూరుపాడు మండలాల మధ్య ఆడ చిరుతపులి సంచరిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తం కాగా.. ప్రస్తుతం అదే మండలంలో చిరుతపులి పిల్ల కనిపించడంతో ఆ చిరుత పిల్లలను పెట్టి ఉంటుందనే చర్చ జరుగుతోంది.

ఆందోళనలో రైతులు, ప్రజలు

చిరుత పులి సంచరిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ఒక్కసారే కాకుండా గతంలోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుమార్లు పాదముద్రలను గుర్తించగా.. ఏన్కూరు మండలంలో మరోసారి చిరుతపులి సంచరిస్తుందన్న వార్త సంచలనం కలిగిస్తోంది. ఏన్కూరు మండలంలో అటవీ ప్రాంతం ఉండటం, ఈ అటవీ ప్రాంతం సమీపంలోనే పొలాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో పొలాలకు కాపలా కాసేందుకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.

మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు



బోనకల్‌ మండలం కలకోటలో కాటమయ్య కిట్‌ అందజేస్తున్న భట్టి విక్రమార్క

- అభివృద్ధి, సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం
- దీపావళి కానుకగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

ఖమ్మంసహకారనగర్‌/బోనకల్‌/ముదిగొండ: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే లక్ష్యంగా ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌, భోజన శాల, కలెక్టరేట్‌ ఎదుట బస్‌ షెల్టర్‌, స్త్రీ టీ స్టాల్‌, లేడిస్‌ లాంజ్‌లను కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ తదితరులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం బోనకల్‌, ముదిగొండ మండలాల్లో పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలకు ప్రజా ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని, వచ్చే నాలుగేళ్లలో ఏడాదికి రూ.25వేల కోట్ల చొప్పున మొత్తం రూ.లక్ష కోట్ల రుణాలు ఇస్తామని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో మహిళా సంఘాల సభ్యులతో మహిళా శక్తి క్యాంటీన్‌ ఏర్పాటు చేశామని, దీని వల్ల 14 మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. జిల్లాలో స్త్రీ టీ స్టాళ్లను బస్టాండ్‌, రైల్వే స్టేషన్‌ తదితర జనసంచారం కలిగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం బోనకల్‌ మండలం తూటికుంట్ల–గోవిందాపురం(ఎల్‌) గ్రామాల మధ్య నిర్మించే బీటీ రోడ్డు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. రూ.2.45 కోట్లతో నిర్మించే బ్రాహ్మణపల్లి – రాపల్లి రోడ్డు పనులకు, కలకోట – నారాయణపురం, ఆళ్లపాడు – నారాయణపురం రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. కలకోటలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. మత్స్యసహకార సంఘం సభ్యులకు చేపపిల్లలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల భద్రత, ఆరోగ్యాలను పరిగణనలోకి తీసుకుని ఈ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం వృత్తిదారుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. 100 శాతం రాయితీపై ఇస్తున్న చేపపిల్లల పంపిణీలో అవకతవకలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.



కలెక్టరేట్‌ వద్ద బస్‌ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌

అర్హులందరికీ ఇళ్లు..

ముదిగొండ మండలం చిరుమర్రి, ముదిగొండ, వెంకటాపురం, యడవల్లి, కట్టకూరు, మాధాపురం గ్రామాల్లో బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన భట్టి మాట్లాడుతూ.. దీపావళి కానుకగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు రుణమాఫీపై మధిర ఏడీఏ విజయచంద్రను అడిగి తెలుసుకున్నారు. ఈ ఐదేళ్ల పాటు ఒక్క నిమిషం కూడా సమయం వృథా చేయకుండా ఉరుకులు, పరుగులతో రాష్ట్రాన్ని, మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అంతకుముందు యడవల్లిలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌ నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్‌ శ్రీజ, అసిస్టెంట్‌ కలెక్టర్‌ మృణాల్‌ శ్రేష్ఠ, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, ఆర్‌అండ్‌బీ ఈఈ జ్ఞానేశ్వర్‌, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ నాగేందర్‌రెడ్డి, ఆర్‌డీఓ గణేష్‌, ఏడీఏ విజయచందర్‌, పంచాయతీరాజ్‌ డీఈ కోటేశ్వరావు, విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ సురేందర్‌, ఐసీడీఎస్‌ సీడీపీఓ బాలాత్రిపుర సుందరి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సమస్యల పరిష్కారానికే పొలం బాట

- భద్రతా చర్యలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు
- ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్‌ ప్రమాదాల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేయడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్‌ సమస్యలను పరిష్కరించేందుకే తమ శాఖ అధికారులు, ఉద్యోగులతో పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్‌ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోందని, భద్రత చర్యల్లో నిర్లక్ష్యం, అవగాహన లోపంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. గృహాల్లో నాణ్యమైన వైరింగ్‌ లేకపోవడం, నాసిరకమైన పరికరాలు వాడడం, రైతులు వ్యవసాయ మోటార్ల స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు(ఎర్తింగ్‌) పాటించకపోవడం వంటి కారణాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటి నివారణకు చేపట్టిన పొలంబాట కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని పేర్కొన్నారు. వేలాడుతున్న విద్యుత్‌ తీగలు, ఒరిగిపోయిన స్తంభాలను మారుస్తున్నామని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తున్నామని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్‌ ఫ్రీ నంబర్‌ 1912 రాయిస్తున్నామని, రైతులకు ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని సూచించారు.

ఇటీవల చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన జి. ప్రసాద్‌ అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందారని, అందుకు బాధ్యులైన జూనియర్‌ లైన్‌మెన్‌ను ఖమ్మం ఎస్‌ఈ సస్పెండ్‌ చేశారని తెలిపారు. ఏఈపై కూడా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రతీ ఉద్యోగి విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, వినియోగదారులకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులు సామాజిక స్పృహతో పని చేయాలి

ఖమ్మం సహకారనగర్‌ : ఉపాధ్యాయులు సామాజిక స్పృహతో పని చేయాలని టీపీటీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీలో నిర్వహించిన నూతన ఉపాధ్యాయుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీపీటీఎఫ్‌ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌ రాజు, కార్యదర్శి మారం నాగిరెడ్డి, ఆళ్ల రామారావు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌ మాట్లాడుతూ సీపీఎస్‌ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఏ.వీ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర కౌన్సిలర్‌ వెంకటేశ్వరరావు, రమాదేవి, ముత్తయ్య, మల్లయ్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు..

- డయాలసిస్‌ బాధితులకు పింఛన్‌ కష్టాలు
- ఉమ్మడి జిల్లాలోని 584 మందిలో 240 మందికే పెన్షన్‌
- తమకూ మంజూరు చేయాలని మిగతా వారి వేడుకోలు



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోరక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

ఖమ్మంవైద్యవిభాగం: పింఛన్‌ కోసం కిడ్నీ బాధితులు ఎదురు చూస్తున్నారు. ఏళ్లుగా డయాలసిస్‌ చేయించుకుంటూ ఇబ్బంది పడుతున్న తమకు పింఛన్‌ విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాలకు వెళ్లి చాలా మంది రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వేలాది మంది కిడ్నీ బాధితులు ఉన్నా వారికి సరిపడా డయాలసిస్‌ సెంటర్లు అందుబాటులో లేవు. చాలా మందికి పెన్షన్‌ కూడా అందడం లేదు. దీంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 584 మందికి డయాలసిస్‌

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డయాలసిస్‌ కేంద్రాలు 10 మాత్రమే ఉన్నాయి. వాటిలో షిఫ్టుల వారీగా 584 మంది డయాలసిస్‌ చేయించుకుంటున్నారు. కొందరు వారంలో మూడు, నాలుగు సార్లు చేయించుకుంటుండగా, మరి కొందరు 1, 2 సార్లు చేయించుకోవాల్సి వస్తోంది. డయాలసిస్‌ చేయించుకోవడానికి అవకాశం లేక మరి కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు చేసేది లేక ఇంటి వద్దనే తనువు చాలిస్తున్నారు. జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రులు, మమత, శ్రీరక్ష, సాయి మారుతి ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్‌ కేంద్రాలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్‌ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో డయాలసిస్‌ చేయించుకుంటున్న బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలే ఉంటున్నారు.

సగం మందికి పైగా అందని పెన్షన్‌

ఉమ్మడి జిల్లాలో డయాలసిస్‌ చేయించుకుంటున్న వారిలో సగం మందికి పైగా పింఛన్‌ అందడం లేదు. మొత్తం 584 మంది వివిధ కేంద్రాల్లో డయాలసిస్‌ చేయించుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో 359 మంది, భద్రాద్రి జిల్లాలో 225 మంది ఉండగా, మొత్తంగా 240 మందికి మాత్రమే పెన్షన్‌ అందుతోంది. మిగతా వారు 3, 4 ఏళ్లుగా పింఛన్‌ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. డయాలసిస్‌ బాధితులు సాదారణంగా ఏ పనులూ చేయడానికి అవకాశం ఉండదు. వారంలో రెండు, మూడు సార్లు రక్త శుద్ధి చేయించుకోవడంతో తీవ్రంగా నీరసించిపోతారు. ప్రభుత్వం అందించే పింఛన్‌ కొంత మేర అవసరాలకు ఉపయోగపడుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ వారికి నిరాశే మిగులుతోంది. డయాలసిస్‌ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా సేవలు అందిస్తున్నా, మందులు, ప్రయాణ ఖర్చులు మాత్రం భరించడం లేదు.

పింఛన్‌ ఇప్పించండి..

గత రెండేళ్లుగా డయాలసిస్‌ చేయించుకుంటున్నా. వారంలో మూడు సార్లు ఆస్పత్రికి రావాల్సి వస్తోంది. ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. పింఛన్‌ అయినా వస్తుందని ఎదురు చూస్తున్నా. అధికారులు వెంటనే పింఛన్‌ ఇప్పించేలా చూడాలి. మందుల కొనుగోలుకు ఇబ్బంది పడుతున్నాను. మందులు కూడా అందించాలి.

– పి.అలివేలు, తుమ్మలపల్లి, కొణిజర్ల మండలం

మూడేళ్లుగా డయాలసిస్‌ చేయించుకుంటున్నా..

కిడ్నీ సమస్యలతో గత మూడేళ్లుగా డయాలసిస్‌ చేయించుకుంటున్నా. అయినా ఇంత వరకు పింఛన్‌ విడుదల కాలేదు. ఏ పనీ చేయలేకపోతున్నాను. వచ్చే రాబడి లేక ఆర్థికంగా కష్టాలు పడాల్సి వస్తోంది. ప్రతీ వారం మూడు సార్లు రావాల్సి వస్తుండటంతో ప్రయాణ ఖర్చులు భారంగా మారాయి. మందుల కొనుగోలుకు కూడా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి పింఛన్‌తో పాటు బస్‌పాస్‌ ఇప్పించాలి.

– సీహెచ్‌.భీష్మారావు, ముతాపురం, నేలకొండపల్లి మండలం

క్లుప్తంగా

రైతు సంక్షేమమే మోదీ ధ్యేయం



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

ఖమ్మంమామిళ్లగూడెం: రైతు సంక్షేమం కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ కేంద్రాలను ప్రారంభించామని, మొదటి రకం పత్తికి రూ.7,521 మద్దతు ధర నిర్ణయించడం హర్షణీ యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి దళారులు, వ్యా పారుల చేతిలో పత్తి రైతులు మోసపోకుండా కేంద్రం ఇస్తున్న మద్దతు ధర అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సీసీఐ కేంద్రంలో రైతులకు ఏదైనా ఇబ్బంది కలిగితే నేరుగా ఫిర్యాదు చేసేందుకు గ్రీవెన్స్‌సెల్‌ను కూడా ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీసీఐ అధికారులకు సూచించారని వెల్లడించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో చావా కిరణ్, గుత్తా వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, ఎల్లారావుగౌడ్, సరస్వతి పాల్గొన్నారు.

'ఐలు' రాష్ట్ర మహిళా కన్వెన్షన్

ఖమ్మంలీగల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర తృతీయ మహిళా కన్వెన్షన్ సందర్భంగా ఖమ్మం బైపాస్ రోడ్డులోని సప్తపది ఫంక్షన్‌హాల్లో 'రాజ్యాంగ పరిరక్షణలో మహిళల పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఐలు మహిళా కన్వీనర్ చందాల శైలజ అధ్యక్షత వహించారు. రెండో రోజు జరిగిన మహాసభలో రాష్ట్రంలో మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై, భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధులు చర్చించారు. చివరగా కొత్త కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. చందాల శైలజ కన్వీనర్‌గా, కోకన్వీనర్లుగా మోతుకూరి వనజ, ఎల్లావుల మంజులత, పలివేల శ్రీలక్ష్మి, రామలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమాల్లో ఐలు నేషనల్ కౌన్సిల్ మెంబర్లు ఏడునూతల శ్రీనివాసరావు, జలసూత్రం శివరాంప్రసాద్, ఐలు రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల్‌రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మందడపు శ్రీనివాస రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొనుగోటి కిషన్ రావు, రిసెప్షన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నల్లమల నవీన్, చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు, ఐలు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఐలు ఖమ్మం పట్టణ కమిటీ కార్యదర్శి ఇ.కిశోర్ పాల్గొన్నారు.

ఒక డీఏనే విడుదల చేయడం విచారకరం

ఖమ్మంసహకారనగర్: ఐదు వాయిదాల కరువు భత్యం (డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం విచారకరమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగ మల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ఉద్యోగులు గత పదినెలలుగా ఓపిక పట్టారని, వినిమయ ధరల సూచీకి అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించాల్సి ఉండగా కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఈ ఆనవాయితీని పాటించటం లేదని ఆరోపించారు.

నేడు అన్నదానం

ఖమ్మంరూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం మండలంలోని రాజీవ్‌గృహకల్పలో మదర్ థెరిస్సా మిషనరీ చారిటీలో అన్నదానం నిర్వహించనున్నట్లు మండల పీఎస్‌ఆర్ యూత్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

సత్తుపల్లి: సత్తుపల్లి పాత సెంటర్ యూపీఎస్ హెచ్‌ఎం చిత్తలూరు ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. దసరా సెలవుల్లో సొంత అవసరాలకు మధ్యాహ్న భోజన కార్మికులను ఉపయోగించుకున్నందుకు గాను అతడిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు డీఈఓ శనివారం రాత్రి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాణాసంచా దుకాణాలకు డ్రా

ఖమ్మంక్రైం : నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న బాణాసంచా దుకాణాలకు ఖమ్మం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) నరేష్‌కుమార్ ఏసీపీ రమణమూర్తితో కలిసి ఆదివారం డ్రా తీశారు. కాలేజీ ఆవరణలో మొత్తం 132 దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా 128 షాపులకు అనుమతి లభించింది. అయితే గ్రౌండ్‌లో 122 దుకాణాలకే స్థలం కేటాయించడంతో మిగిలిన ఆరు దుకాణాల వారు తమకు కూడా అదే గ్రౌండ్‌లో స్థలం ఇప్పించాలని అధికారులను కోరుతున్నారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం మధ్యవర్తుల పెత్తనం లేకుండా పారదర్శకంగా దుకాణాల కేటాయింపు చేశామని డీసీపీ తెలిపారు.

విద్యుత్ అధికారులూ.. పట్టించుకోండి

- ప్రత్యామ్నాయ ఫీడర్ ఏర్పాటులో వీడని నిర్లక్ష్యం
- ఉన్న ఒక్కటీ మొరాయిస్తే ఆరు మండలాలకు కరెంట్ కట్
- ఆదివారం ఐదు గంటల పాటు స్తంభించిన సరఫరా
- ఎవరికీ పట్టని వినియోగదారుల గోడు



ఇల్లెందులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

ఇల్లెందురూరల్: విద్యుత్ సరఫరా వ్యవస్థలో ప్రాథమిక జాగ్రత్తలను గాలికొదిలేసిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు వినియోగదారులకు తరచూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. గ్రిడ్ నుంచి ప్రధాన సబ్‌స్టేషన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు ఒకటికి మించి ఫీడర్లను ఏర్పాటు చేస్తారు. ఇది మెరుగైన విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కో అవలంబించే ప్రథమ సూత్రం. కానీ, బూడిదంపాడు వద్ద ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరా వ్యవస్థలో నిబంధనలు, ప్రాథమిక సూత్రాలను పట్టించుకోవడంలేదనే విషయం.. ప్రస్తుత విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలిస్తే అవగతమవుతుంది. అందుకు ఆదివారం ఆరు మండలాల పరిధిలో స్తంభించిన విద్యుత్ సరఫరా కారణంగా ప్రజలు పడిన ఇబ్బందులే నిదర్శనం.

ఏళ్లుగా ఇదే సమస్య..

ఖమ్మం జిల్లా బూడిదంపాడు 400 కేవీ గ్రిడ్ నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇక్కడి నుంచి ఇల్లెందు మున్సిపాలిటీ, మండలం, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, కారేపల్లి, కామేపల్లి మండలాలలోని 130 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. అక్కడి నుంచి ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కేవలం ఒక ఫీడర్‌ను మాత్రమే ఏర్పాటు చేశారు. కానీ రాష్ట్రంలో ఏ ఇతర 132 కేవీ సబ్‌స్టేషన్‌కైనా రెండు అంతకు మించిన ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఒక ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైతే రెండో ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తారు. కానీ, ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు మాత్రం ఏళ్ల తరబడి ఒక్క ఫీడర్ ద్వారానే విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. ఈ ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైన సందర్భంలో ఆరు మండలాల ప్రజలు మరమ్మతులు పూర్తయ్యే వరకు విద్యుత్ కోతను అనుభవించాల్సిందే.

చిరువ్యాపారులకు పెద్ద నష్టం..

నష్టాల భారం కారణంగా ఎప్పుడు మూతపడుతాయో తెలియని స్థితికి చేరుకున్న మూడు పెంకు పరిశ్రమలు ఇల్లెందు మండలంలో ఉన్నాయి. వీటితోపాటు విద్యుత్ ఆధారిత చిన్నచిన్న దుకాణాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆరు మండలాల పరిధిలో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. నెలలో కనీసం మూడు, నాలుగు సార్లు బూడిదంపాడు నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల వారంతా తీవ్రంగా నష్టపోతున్నారు. ఇల్లెందు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరు మండలాల్లో ఒకటి, రెండు మండలాలు మినహాయిస్తే వంద ఎకరాలకు సాగునీటిని అందించగలిగే చెరువులు కనిపించవు. ఈ కారణంగా అత్యధిక సంఖ్యలో రైతులు ఆకాశపాయ పంటలను, బోర్లు, బావుల కింద పంటలను సాగు చేస్తున్నారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో కూరగాయల సాగు కూడా చెప్పుకోతగ్గ విస్తీర్ణంలో ఉంటుంది. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులందరికీ విద్యుత్ సరఫరా ప్రధాన ఆధారం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన చోట విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

ప్రత్యామ్నాయ వ్యయం రూ.కోటి

బూడిదంపాడు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కోసం ప్రస్తుతం ఒక్క ఫీడర్‌ను మాత్రమే ఏర్పాటు చేశారు. తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు మాత్రం అదనపు ఫీడర్ అవసరాన్ని విస్మరిస్తున్నారు. ప్రస్తుతం బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అవే విద్యుత్ స్తంభాలకు మరోవైపుగా వేరొక ఫీడర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. బూడిదెంపాడు నుంచి ఇల్లెందు వరకు ప్రస్తుతం ఉన్న స్తంభాల ద్వారా అదనపు కేబుల్ అమర్చి అదనపు ఫీడర్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాన్స్‌కోకు రూ.కోటి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ ఖర్చును విస్మరిస్తున్న ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్నా ప్రత్యామ్నాయం దిశగా ఆలోచన చేయకపోవడం విచారకరం.

ఉన్నతాధికారులకు విన్నవించాం



బూడిదంపాడు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ప్రస్తుతం ఒక్క ఫీడర్ ద్వారా మాత్రమే సరఫరా జరుగుతోంది. ఈ ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైతే ఆరు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు అదనపు ఫీడర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. వారి సమాధానం కోసం ఎదురుచూస్తున్నాం.

–కోటేశ్వరరావు, ఏడీఈ, ఇల్లెందు సబ్‌డివిజన్

అండర్ -19 క్రీడా జట్ల ఎంపిక



కబడ్డీ పోటీల్లో బాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వార్యాన ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించారు. అండర్ -19 విభాగంలో బాస్కెట్‌బాల్, కరాటే, నెట్‌బాల్, అండర్ -14 విభాగంలో బాలబాలికల నెట్‌బాల్ ఎంపికలు జరిగాయి. అయా క్రీడాంశాల్లో జిల్లా జట్టుకు ఎంపిక చేసి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని జూనియర్ కళాశాలల క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ మూసాకలీం తెలిపారు. ఎంపికల్లో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీపీఈఓ రవిబాబు, పీడీలు పి.వి.రమణ, కృష్ణమూర్తి, ఎస్.ఫణికుమార్, పరిపూర్ణాచారి, గోపతి సైదులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

అండర్-19 బాస్కెట్‌బాల్ బాలుర జట్టుకు ఆర్. దివాకర్, కె.సాయిలోకేష్, ఎం. రవిచంద్ర, ఎ.వర్షిత్, ఎస్. జోయ్‌దీప్, ఆర్. విష్ణువర్ధన్, జి.వెంకటారామ్‌సత్య, డి.యతేష్వర్, ఎ.క్రిస్టోరెక్స్, ఎస్.కె. జుబేర్‌అహ్మద్, ఎ.సాయిదీపక్, సీహెచ్.రాజ్‌కుమార్. బాలికల జట్టులో రిషిక, బి.భానుస్పందన, జి.మౌనిక, సీహెచ్. సారిక, డి. ధత్రి, ప్రవళిక జోసేఫ్, జబ్బిన్, జి.లిఖిత, జె.తునుశ్రీ, టి. షణ్ముక ప్రియ, కె.స్పందన, ఈ.అక్షర ఎన్నికయ్యారు. బాలుర కబడ్డీ జట్టుకు ఎస్.కె.సమీర్, జె.భానుప్రసాద్, బాలాజీ, గోపి, గౌతమ్, విష్ణు, గోపినాయక్, ఉదయ్‌కుమార్, అరవింద్, భావ్‌సింగ్, మధు, వెంకట్‌సాయి, నాగబాబు, విష్ణుకుమార్, ప్రేమ్‌కుమార్, బాలికల జట్టుకు జోగమ్మ, హాసిని, అనూష, గీతాంజలి, హారిక, జోత్స్న, వెంకటనర్సమ్మ, శ్రీవల్లిక, ప్రణీశా, అంజలి, కె.సోనియా, మాధవి, తాసిక, మయూరి, హర్షిని, కరాటే బాలుర విభాగంలో అరుణ్‌తేజ్, శివాజీ, శివప్రకాష్, నాగసాయి, విఘ్నేష్, అదిల్, పాషా, అభినయ్‌శ్రీ, సచిన్, బాలికల విభాగంలో ఎల్.త్రిష, కీర్తన, రిజార్, కావ్యచౌదరి, కిరణ్మయి, నికిత ఎంపికయ్యారు. అండర్ – 19 నెట్‌బాల్ బాలుర జట్టుకు శ్రీరాం, వర్షిత్, దివాకర్, ఉదయ్, సాయిలోకేష్, శివ, క్రిస్టోఫరెక్స్, శ్రీనివాస్, వసంత్‌నాయక్, మణికంఠ, జైదీప్, గణేష్, బాలికల జట్టుకు మౌనిక, సాగరిక, రిషిక, దీపిక, నిక్షిత, రోదయ్‌గ్రేస్, భావన, కారిక్ష, రిషిత, సుచరిత, వర్షిని, సాయిచరిత, రిక్షత ఎన్నికయ్యారు. బాలబాలికల ఉషు జట్టుకు నందకిషోర్, శివాజీ, సాయిత్రిష, నవ్యశ్రీ, యామిని ఎంపికయ్యారు. అండర్-14 నెట్‌బాల్ బాలుర జట్టుకు బి.సూర్య, వి.సాత్విక్, వి.గిరిష్‌తరుణ్, బి.హరిచరణ్, జి.వివేకానంద, డి.కార్తీక్, ఐ.మనోహర్, ఎన్.నిఖిల్, జి.కాంత్రికుమార్, ఎ.వంశీ, జి.అశిష్, కె.వేణుకుమార్, రోహిత్‌సాయి, ప్రేమ్‌చంద్. బాలికల జట్టుకు పి.అఖిల, ఎ.మహేశ్వరి, బి.నందిని, ఇ.సింధుఅష్ట్ర, జి.త్రివేని, చాందిని, హారిక, శ్వితేజ, కె.దేవాయాని, కె.రిషిత, కె.రితిక సహస్ర, కె.రక్షిత, వర్షిని, ఎం.సుచరిత ఎంపికయ్యారు.

నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. వీరు నవంబర్‌లో ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి ఎస్. ఫణికుమార్ తెలిపారు. జిల్లా బాలుర జట్టుకు స్నేహిత్, అయాన్, గియాజ్, సాయిచరణ్, శివకళ్యాన్, వివేకనంద, సీహెచ్. సిద్ధు, జగన్, అశిష్, ప్రేమ్‌చంద్, శివకుమార్, బాలికల జట్టుకు ఎ.మహేశ్వరి, ఇసిబ్బ, హారిక, సింధుప్రియ, నందిని, త్రివేణి, చాందిని, విశ్వతేజ, అవంతిక, అమృత, దేవయాని, మౌనిక ఎంపికయ్యారని ఆయన వివరించారు.

కమ్యూనిస్టులు ఏకం కావాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

తిరుమలాయపాలెం: దేశంలో మతోన్మాద బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు, కష్టజీవుల మనుగడకు కమ్యూనిస్టులంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని పిండిప్రోలులో ఆదివారం నిర్వహించిన 9వ మండల మహాసభలో తమ్మినేని పాల్గొని మాట్లాడారు. దేశంలో మతోన్మాద పార్టీ రాజ్యమేలుతున్న సమయంలో ప్రజలు ఆ పార్టీ వైపు మొగ్గుచూపడం దేశ భవిష్యత్‌కు నష్టమని, ప్రజలను మభ్యపెట్టి బీజేపీ పన్నుతున్న కుట్రలకు ఆద్యం పోస్తున్న కార్పొరేట్ శక్తులకు గుణపాఠం చెప్పాలంటే కమ్యూనిస్టులంతా ఏకం కావడం అనివార్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి నెరవేర్చలేని వాగ్దానాలను ఎన్నికల సమయంలో ఇచ్చి, ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయలేదని ఆరోపించారు. ఎర్రజెండా పార్టీల పోరాట ఫలితంగా దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని గుర్తు చేశారు. మహాసభ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్మారక స్తూపాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతోపాటు బండి రమేశ్, నర్సయ్య, ఎర్ర శ్రీనివాస్, షేక్ బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, దొండేటి ఆనందరావు, అంగిరేకుల నర్సయ్య, పద్మనాభల సుధాకర్, చల్ల వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, పప్పుల ఉపేందర్, దొడ్డ లింగస్వామి, దొండేటి నిర్మల్‌రావు, పిట్టల పాపారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మహాసభలో సీపీఎం మండల కార్యదర్శిగా రెండో సారి తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొమ్ము శ్రీనును ఎన్నుకున్నారు.

బస్ షెల్టర్ కూల్చివేత



రెబ్బవరంలో బస్‌షెల్టర్‌ను కూల్చిన దృశ్యం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో 2001లో నిర్మించిన బస్ షెల్టర్‌ను శనివారం అర్ధరాత్రి దుండగలు జేసీబీతో కూల్చి వేశారు. బస్ షెల్టర్ వెనుక భాగంలో ఉన్న ప్రైవేట్ స్థలాన్ని ఓ మహిళ కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి బస్ షెల్టర్‌ను ఆక్రమించి వ్యాపారం చేస్తోంది. అందులోనే బెల్టు దుకాణం నడిపిస్తున్నట్లు ఫిర్యాదు అందటంతో మధిర ఆర్టీసీ డిపో మేనేజర్ ఆదేశాల వరకు వైరా బస్టాండ్ సూపర్‌వైజర్లు వెళ్లి బస్‌షెల్టర్‌ను ఖాళీ చేయాలని సదరు మహిళకు చెప్పినట్లు తెలుస్తోంది. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు వైరా ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సైతం బస్‌షెల్టర్‌ను ఖాళీ చేయాలని ఆదేశించారు. కొద్దిరోజుల తర్వాత మళ్లీ వ్యాపారం మొదలుపెట్టిన మహిళకు నచ్చజెప్పి దుకాణం తొలగించారు. ఈ సందర్భంగా లోలెవెల్‌లో ఉన్న ఉన్న బస్‌షెల్టర్‌ను కొంచెం ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. బస్‌షెల్టర్ ఎత్తు లేపితే తన వ్యాపారం దెబ్బతింటుందని భావించిన మహిళ శనివారం అర్ధరాత్రి జేసీబీతో నేలమట్టం చేయించినట్లు ఆర్టీసీ అధికారులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. ఆదివారం ఆర్టీసీ మధిర డిపో మేనేజర్‌లో సెలవులో ఉన్నందున సోమవారం వైరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. వైరా నుంచి మధిర, జగ్గయ్యపేట వైపు నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం కృష్ణా జిల్లా గంపలగూడెం నెమలికి చెందిన వనమా విశ్వనాథం ఆర్థిక సాయంతో 2001లో ఈ బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్తులను పోలీసులు వారించి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు.

పొంగులేటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తామని మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, అనంతరం ప్రభుత్వాస్పత్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 10.30 గంటలకు దానవాయిగూడెం, రామన్నపేట కాలనీల్లో, 11 గంటలకు ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్‌లో, 11.30 గంటలకు కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, మధ్యాహ్నం 12.30 గంటలకు ఖమ్మంలోని జీవనసంధ్యా వృద్ధాశ్రమం, అన్నం ఫౌండేషన్‌లో అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సాయంత్రం 4 గంటలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పొంగులేటి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ ఉపాధ్యక్షురాలు పెంటమళ్ల పుల్లమ్మ కోరారు. కూసుమంచి క్యాంపు కార్యాయలంలో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పొంగులేటిపై కార్యకర్త అభిమానం



ఛాతీపై పొంగులేటి చిత్రాన్ని వేయించుకున్న నాగరాజు

ఖమ్మం నగరంలోని సంభానినగర్ కు చెందిన బొల్లిని నాగరాజు యాదవ్ తన ఛాతీపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రాన్ని టాటో వేయించుకుని అభిమానం చాటుకున్నాడు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ప్రాంతంలోని చర్చికాంపౌండ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బుడి రవికుమార్ (40) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉన్న అతను ఇంట్లో కుటుంబసభ్యులు లేని సమయంలో మద్యం బాగా సేవించి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి భార్య దేవమణి ఫిర్యాదు మేరకు సీఐ ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్ వద్ద ఖమ్మం – సూర్యాపేట ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ డివైడర్‌కు ఢీకొని ఆరెకట్ల వీరబాబు (36) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆరెంపులకు చెందిన వీరబాబు పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బైక్‌పై ఖమ్మం వెళ్లి తిరిగి వస్తుండగా పొన్నేకల్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కారేపల్లి: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా తూర్పుతండాకు చెందిన బాణోతు చక్రి (21) ఖమ్మంలో పానిపూరి బండి నడుపుతున్నాడు. తన భార్య గర్భవతి కావటంతో తన పుట్టిల్లు అయిన ఇల్లెందు మండలం బొంబాయితండాకు వెళ్లింది. చక్రి నెల రోజుల నుంచి పానిపూరి బండి తీయకుండా తిరుగుతుండటంతో తల్లి మందలించింది. మనస్తాపం చెందిన చక్రి కారేపల్లి మండలం ఉసిరికాయపల్లి సోలార్ ప్లాంట్ వద్ద ఈనెల 26వ తేదీన పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని చక్రిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజారాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో మొండికుంట – భద్రాచలం రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటాపురం గ్రామానికి చెందిన సోయం సందీప్ (24) మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన సోయం సందీప్, కుక్కునూరు మండలం అమరారం గ్రామానికి చెందిన కారం సాయికిరణ్ బైక్‌పై వెంకటాపురం వస్తుండగా నెల్లిపాకబంజర గ్రామానికి చెందిన గొర్రెముచ్చు వేణు మరో ఇద్దరు బైక్‌పై నెల్లిపాకబంజర వెళ్తుండగా రెండు బైక్‌లు మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సోయం సందీప్‌ను ఎస్ఐ తిరుపతిరావు తన వాహనంలో అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారిని 108లో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గత ఏడాది అక్టోబర్ 27న మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఏడాది తర్వాత ఇదే రోజు ఒకరు మృతి చెంది నలుగురు గాయపడటం చర్చనీయాంశంగా మారింది.

విద్యాశాఖపై కలెక్టర్ నిఘా..?

- అవినీతి ఆరోపణలపై రహస్యంగా విచారణ
- తలలు పట్టుకుంటున్న అధికారులు, సిబ్బంది

ఖమ్మంసహకారనగర్: విద్యాశాఖలో కొందరు అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆ కార్యాలయం నుంచి ఏ పని కావాలన్నా ఎంతో కొంత ముట్ట చెప్పాలనేది బహిరంగ రహస్యంగా మారిందనే విమర్శలున్నాయి. అన్ని శాఖల్లో కెల్లా విద్యాశాఖ కీలకం. అలాంటి శాఖలో కీలకంగా ఉండాల్సిన అధికారులు, సిబ్బంది లేకపోవటంతో వారి స్థానాల్లో డిప్యూటేషన్లపై వచ్చినవారు ఉంటున్నారు. ఎఫ్ఏసీ, ఇన్‌చార్జ్‌లుగా ఉండటంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోందనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు పలువురు వివరించగా.. ఆ శాఖ పనితీరుపై నిఘా పెట్టినట్లుగా తెలుస్తోంది.

విచారణకు ప్రత్యేక అధికారి..

జిల్లా విద్యాశాఖపై ఇటీవల అధికంగా వచ్చిన అవినీతి, ఆరోపణలపై కలెక్టర్ నిఘా పెట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో ఓ శాఖకు చెందిన అధికారిని పలు ఆరోపణలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన నివేదికను అందించినట్లు తెలిసింది. విద్యాశాఖలో ఓ ఉద్యోగి స్కూల్ గ్రాంట్ సుమారు రూ.1.83 కోట్లు స్వాహా చేసినట్లు తేలింది. ప్రధానంగా డీఎస్సీ–2024లో ముగ్గురు అభ్యర్థులకు సంబంధించి తప్పుడు రిపోర్టులతో ఉద్యోగాల్లో చేరికకు రంగం సిద్ధం చేసిన ఆరోపణలపై, ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై కూడా అవినీతి ఆరోపణలు రావటంతో నిఘా పెట్టినట్లు తెలిసింది. ఇటీవల కొందరు ఉపాధ్యాయులు, సిబ్బంది ఇతర దేశాల్లో ఉంటున్న బంధువులకు వద్దకు వెళ్లేందుకు నోడ్యూ సర్టిఫికెట్ విద్యాశాఖ నుంచి ఇవ్వాల్సి ఉండగా.. వీటిల్లోనూ విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది చేయి తడపందే సర్టిఫికెట్లు జారీ చేయటం లేదనే విమర్శలున్నాయి. దీంతో జిల్లా కలెక్టర్ విచారణ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.